క్లుప్తంగా

నేడు అభయాంజనేయ స్వామి తిరునాళ్ల

సదుం: మండలంలోని ఊటుపల్లె క్రాస్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకాలు, సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు, వీధినాటకం, కోలాటాలు, భజనలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

సదుం: మండల కేంద్రంలోని గార్గేయనదీ తీరాన వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, విశేషాలంకారం చేశారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

గంగవరం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉన్న ల్యాబ్‌ను మలేరియా సబ్ యూనిట్ అధికారి జయశంకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌కు సంబంధించిన రికార్డులు పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్లకు తగు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న ప్రజల రక్తనమూనాలను సేకరించి సాయంత్రంలోపు పీహెచ్‌సీకి పంపేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రక్త పరీక్షల అనంతరం రిపోర్టు ఆధారంగా రోగులకు వైద్యసేవలు అందించాలని సూచించారు.

నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

పుంగనూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులందరూ ఈనెల 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్టీఓ కార్యాలయ పరిధిలోని పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ అందజేయకపోతే పెన్షన్ నిలిచిపోతుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకుని సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

దూర విద్యలో ఇంటర్ కోర్సులు

గుడుపల్లె: దూరవిద్య కేంద్రంలో ఇంటర్మీడియెట్ కోర్సులకు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెన్నెల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం విజయవాడ ఆదేశాల మేరకు దూర విద్యాకేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. పదో తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఇంటర్ డ్రాప్ అవుట్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులూ అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకుని కళాశాలలోని కంప్యూటర్ అధ్యాపకుడు కార్తికేయన్‌ను సంప్రదించాలన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్ అన్నపూర్ణ దేవి

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ ఆఫీసర్, అగ్రికల్చర్ అసిస్టెంటు డైరెక్టర్ అన్నపూర్ణ దేవి మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్ సుబ్రమణ్యం, వీఆర్వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కామ్రేడ్ వెంకటేష్‌కు నివాళులు


వెంకటేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పలమనేరు: ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ నాయకులు, కామ్రేడ్ వెంకటేశు మృతదేహానికి స్థానిక సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మంగళవారం జెండాకప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకటేశు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో మాతృభాషకే తొలి ప్రాధాన్యం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న అతిథులు


కృష్ణాపురం పాఠశాలలో ..

- మాతృభాషతోనే దేశాభివృద్ధి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: మాతృభాషతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని స్థానిక కళాశాలలో తెలుగుభాషా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా వారి మాతృభాషలో పట్టు సాధిస్తేనే గొప్పజ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డా.విజయశేఖరం మాట్లాడుతూ అమ్మభాషకు మించిన భాష ఉండదన్నారు. అందుకే ప్రపంచంలోనే మాతృభాషకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమ సమన్వయకర్త వాసు ఈసందర్భంగా మాతృభాష దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. ఇదే కార్యక్రమాన్ని మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం గురుమూర్తి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్లం నేర్చుకోవడం తప్పనిసరి అయిందని, ఈ మధ్య కాలంలో అనేక మాతృభాషలు కాలగర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైతే భాష నశిస్తుందో ఆ భాషను మాట్లాడే జాతికూడా నశిస్తుందన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బాస్ నాయకులు నిర్వహించారు. దేశభాషలందు తెలుగులెస్స అని పలికిన మహనీయుడు దేవరాయలన్నారు. కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బాస్ నేతలు సోమన్న, జనార్దన్, శంకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు ఆధ్వర్యంలో పలువురు కలసి పట్టణంలో నామఫలకాలు తెలుగులో ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

మాతృభాషతోనే మనోవికాసం..

మాతృభాషతోనే మనోవికాసం కలుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో జరిగిన ఇదే కార్యక్రమంలో తెలుగుభాషపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిభాష అమ్మపాలవంటిదని, పరాయిబాష డబ్బాపాలవంటిందని వివరించారు. కార్యక్రమంలో రచయిత శ్రీరామచంద్రమూర్తి, సంస్థ కార్యదర్శి పుష్ప,సీతారామయ్య, వహీదాబాను, శివశంకరయ్య, చంద్రశేఖరయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

కుప్పం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మాతృ భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అమ్మ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, అధ్యాపకులు మాధవి, నారాయణ పాల్గొన్నారు.

తెలుగుభాషను అమలు చేయాలి


పుంగనూరు: మాట్లాడుతున్న వెంకటపతి, ఇనాయతుల్లాషరీఫ్

పుంగనూరు: ప్రతి కార్యాలయంలో తెలుగు భాషను పటిష్టంగా అమలు చేసి తెలుగు కమ్మదనాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని విశ్రాంత తెలుగు పండితుడు వెంకటపతి అన్నారు. మంగళవారం స్థానిక లైబ్రరీలో అధికారి నసీబ్‌జాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. వెంకటపతి మాట్లాడుతూ.. తెలుగుభాషను అమలు చేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా తీసుకోవాలన్నారు. అప్పుడే భాషకు గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్, విశ్రాంత తెలుగు పండితురాలు గంగులమ్మ, ఫయాజ్, అఫ్సర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు


వినతిపత్రం ఇస్తున్న తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాగరాజ ఆదేశించారు. మంగళవారం మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పెద్ద ఉప్పరపల్లె పంచాయతీల్లో జగనన్న కాలనీలను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఎవరికైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అదే పంచాయతీల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, పంచాయతీ కార్యదర్శులు మసూదా బేగం, లలిత ఉన్నారు.

లబ్ధిదారులకు పూర్తి సహకారం

చౌడేపల్లె: ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని, ఇందు కోసం లబ్ధిదారులకు పూర్తి సహకారం అందిస్తామని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మంగళవారం పెద్దకొండామర్రి, పెద్దయల్లకుంట్ల పంచాయతీల్లోని లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తిచేసిన వారికి త్వరగా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ రఘురామిరెడ్డి, హౌసింగ్ ఏఈ మణి, పంచాయతీ కార్యదర్శి సుకుమార్ ఉన్నారు.

బోయకొండలో అభివృద్ధి పనుల పరిశీలన


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఓఎస్డీ కుమారస్వామి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద 25 ఎకరాల విస్తీర్ణంలో ఎకో టూరిజం ద్వారా అభివృద్ధి పనులకు చర్యలు తీసుకున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి ఓఎస్డీ కుమారస్వామి, మంత్రి పీఏ మునితుకారం, ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళితో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఎకోటూరిజంతోపాటు అర్బన్ హట్, జంగిల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవానీనగర్ నుంచి గంగాపురం వద్ద నాలుగులైన్ల రహదారి పక్కన మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక డ్రైన్, రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గంగాపురంలో భక్తులకు సౌకర్యంగా భోజన వసతి కోసం షాపుల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించి పనులు చేపట్టాలని ఈఓకు ఆదేశించారు. అనంతరం గోశాలకు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వసుంధర, సర్వేయర్ మురళీకృష్ణ, పాల ఏకరి కార్పొరేషన్ డైరక్టర్ లద్దూర మణి, సురేంద్రరెడ్డి, డిష్ సూరి, ఎల్ రెడ్డి, రత్నారెడ్డి, మణి ఉన్నారు.

అమ్మవారి సేవలో ఓఎస్డీ కుమారస్వామి

బోయకొండ గంగమ్మను మంత్రి పెద్దిరెడ్డి ఓఎస్డీ కుమారస్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ నారాయణ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

కొళత్తూరు సచివాలయంలో తనిఖీలు


సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతిరోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చివరగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్ వరలక్ష్మి, సర్పంచ్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం మునిరత్నం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో ఉన్న రాయల మండపంలో మంగళవారం తిరుపతి ఏరియా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి డీపీఎం మునిరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నూర్పిడి అనంతరం పొలంలో చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, నూనెగింజలు వంటి బహుళ పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రకృతిని సంరక్షించడంలో భాగంగా దేశీయ పశువుల పేడతో పలు రకాల కషాయాలను తయారు చేయడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో రైతులకు దేశీయ ఆవులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ స్వామికొండయ్య, యూనిట్ ఇన్‌చార్జ్‌లు సుమతి, రాజేశ్వరి, ప్రేమ, రాజమ్మ, మహేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి ఆదిమూలపు సురేష్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ నెల 22వ తేదీన జిల్లాకు రానున్నారు.

ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆయన బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరుకు విచ్చేస్తారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నుంచి బయలుదేరి, తిరుపతి జిల్లాకు వెళతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి


20వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: కుప్పం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చైర్మన్ సుధీర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా 20వ వార్డులో ఆయన పర్యటించారు. రోడ్లు, వీధుల్లో చెత్తాచెదారం వేయడం వల్ల దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కమిషనర్ రవిరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎంఈఓకు సన్మానం


ఎంఈఓను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ఎంఈఓ సిద్ధరామయ్యను కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం సన్మానించారు. గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ ఎంఈఓగా ప్రశంసా పత్రం అందుకున్న నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహ్మదాలీ, క్లబ్ అధ్యక్షుడు తాతయ్య, సభ్యులు రాజారెడ్డి, ప్రకాష్, వెంకట సిద్ధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


కల్లూరు జెడ్పీ గెస్ట్ హౌస్ వద్ద ఓఎస్డీ కుమారస్వామి, ఎంపీడీఓ, ఎంపీపీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓఎస్డీ కుమారస్వామి మంగళవారం పరిశీలించారు. కల్లూరులోని జిల్లా పరిషత్ అతిథి భవనం, దాసరికుంట, పులిచెర్లలో కొత్తగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ భవనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, ఎంపీడీఓ సుగుణమ్మ, గోవిందరెడ్డి, సౌకత్‌అలీ ఉన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

రామకుప్పం: మండల పరిధిలోని రెడ్డివారిపల్లికి చెందిన లక్ష్మమ్మపై అదే గ్రామానికి చెందిన గోవిందప్ప, మునెమ్మ, నారాయణమ్మ దాడి చేశారు. ఆర్థిక లావాదేవీలే దాడికి కారణమని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టమాట రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కుప్పంరూరల్: లింగాకర్షణ బుట్టలు, జిగురట్టలతో టమాట సాగు చేస్తే చాలా వరకు చీడపీడలు, దోమల నుంచి పంటను రక్షించుకోవచ్చని ఉద్యాన శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం కుప్పం మండలం దాసేగౌనూరు, కొత్తయిండ్లు గ్రామాల్లో టమాట పంట సాగు పద్ధతులను రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు నాగమణి, విజయలక్ష్మి, రాఘవేంద్ర మాట్లాడుతూ..టమాట మొక్కలు నాటే వారం ముందు తోట చుట్టూ జొన్న పంట వేసుకోవాలన్నారు. తద్వారా క్రిమికీటకాలు జొన్న పంట వైపుకు వెళ్లిపోతాయని సూచించారు. అదే విధంగా టమాట సాగులో లింకార్షణ బుట్టలు, నీలం, పసుపురంగు జిగురట్టలతో సాగు చేస్తే చాలా వరకు తెగుళ్లను నివారించవచ్చని చెప్పారు. ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. టమాట, బంగాళదుంప సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఉద్యానాధికారి ప్రియ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడుతో సరికొత్తగా..


చౌడేపల్లె పీహెచ్‌సీ

చౌడేపల్లె: నాడు-నేడు కార్యక్రమం ద్వారా చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి మహర్దశ కలిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సరికొత్తగా ముస్తాబు చేశారు. భవనాలకు రంగులు వేసి ప్రజలను ఆకర్షించేలా ప్రభుత్వ సేవలను వివరిస్తూ ఏర్పాటు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితో ప్రత్యేకంగా 108 వాహనం, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, 104 వాహనాలు కేటాయించినట్లు పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్ భరత్ తెలిపారు. మండలంలోని ప్రజలకు సకాలంలో వైద్య సేవలందించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో మరిన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సమాజ కర్తవ్యం

– సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్మికశాఖ కమిషనర్ ఓంకార్, జడ్జి కరుణకుమార్

చిత్తూరు, అర్బన్: బాల కార్మిక, వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలించడం సమాజంపై ఉన్న ప్రధాన కర్తవ్యమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ పిలుపునిచ్చారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్, చిత్తూరు ఆర్డీఓ రేణుకతో కలసి మంగళవారం చిత్తూరులోని న్యాయసేవా సదన్ భవనంలో బాల కార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించే అంశంపై తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీసు, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు, స్వచ్ఛంద సంస్థలతో అవగాహన సదస్సు నిర్వహించారు. కరుణకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే పక్షం రోజుల పాటు ఆపరేషన్ ''స్వేజ'' పేరిట జిల్లాలో వారోత్సవాలు నిర్వహించి పలువురిని వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేసినట్లు చెప్పారు. ప్రతిశాఖతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెట్టి చాకిరి వ్యవస్థను పూర్తిగా నిర్మిలించేందుకు సహాయపడాలన్నారు. 45 సంవత్సరాల క్రితమే వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చినా.. ఇప్పటికీ పిల్లలతో పని చేయించడం మంచిదికాదన్నారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపుతామన్నారు. కార్మికులకు కనీసం వేతనం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన కనీస వేతన చట్టం అన్ని చోట్ల అమలయ్యేలా చూస్తామన్నారు. బాల్య వివాహాలు కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయక సాంఘిక సంక్షేమ అధికారి, నాగేశ్వరరావు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

బైరాల: ఈ-క్రాప్ నమోదు తప్పనిసరని గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ సునీత సూచించారు. మంగళవారం మండలంలోని 45 కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, దామరగుంట, లింగారెడ్డిపల్లెలో పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలకు సూచించారు. పంట నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర తదితర లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఏఓ వరలక్ష్మి, ఎంపీఈఓ దీపిక, వీఏఏలు సంతోష్, హేమంత్ పాల్గొన్నారు.